"జగన్మాతలాగా వున్నావు దుర్గా", అంటూంటే ఆయనకు కన్నీరు ఆగలేదు.

"ఈ చీర ఎంత?" అన్న ప్రశ్నతో కలకరిగింది.

**"1800..."**

పద్దెనిమిది వందలు.. మనస్సు ఏదో లెక్కలు కడుతోంది. వెంకాయి చీరె రెండువేలు. నాచీరె పద్దెనిమిది వందలు. ఛీ! ఎంత అవమానం!

మరుక్షణం కొత్త పట్టుచీరె గుట్టగా నేలమీద పడింది. పెద్ద శబ్దంతో వంట ఇంటి తలుపు మూసుకుంది.

సుశీల మాట్లాడకుండాచీరె మడత పెట్టడము మొదలుపెట్టింది.

మగపిల్లలు శివయ్యగారి దగ్గరకు వచ్చారు.

"అమ్మని మీరు కంట్రోలు చెయ్యరేం" అని రఘు అడిగాడు.

"అమ్మ అంటె మీకు భయం ఎందుకు?" అని కృష్ణ ప్రశ్నించాడు. సుశీల కన్నులలో ఏదో అభ్యర్ధన ఉంది.

పిల్లలు ముగ్గురు వంక ఆయన పరకాయించి చూసి.. నెమ్మదిగా అన్నాడు, "బాధపడుతున్న వారికి సహాయం చెయ్యాలి. అంతేకాని వారిని కట్టడిలో పెట్టి ఇంకా బాధలు పెట్టకూడదు."

"అమ్మ...

"అమ్మ సంగతే నేను చెబుతున్నాను.. అది గయ్యాళితనము, మూర్ఖత్వము కాదు, మీ అమ్మకు బ్రెయిన్ ట్యూమర్!!"

# 'క్షణికం !'

ఊరు కాని వూళ్ళో దేశం కాని దేశంలో నన్ను పిలుస్తున్నది ఎవరా? అని ఆశ్చర్యంగా అటువైపు చూశాను.

ఎయిర్ కండిషన్ కారు ప్రక్కన నుంచున్న ఆవిడ నా వంక చూస్తూ చిరునవ్వు నవ్వింది. నేను అటువైపు చూడగానే 'చినబాబు' అంటూ పిలుస్తూ చెయ్యి వూపింది.

ఆ కట్టు బొట్టు ఆ తీరు చూస్తుంటే, చెప్పకుండానే, తెలుస్తుంది చాగా కలిగిన వారింటి ఆడపడుచని.

నేను దగ్గరకు రాగానే "నన్ను గుర్తు పట్టావా"? అని అడిగింది. నేను ఆ మనిషిని పోల్చుకోవడానికి ప్రయత్నం చేస్తున్నాను.

"మీరు... మిమ్మల్ని... అంటూ ఏదో చెప్పబోతున్నాను. చిలిపిగా నా వంక చూశింది. సెలయేటి గలగలా నవ్వింది.

నా అనుమానం తీరిపోయింది.

"రామశేషమ్మవి కాదూ?" అని అడిగాను.

మళ్ళీ బిగ్గరగా నవ్వింది. నావంక కొంటెగా చూస్తూ అమ్మయ్య! కొండంత బరువు

తీరింది. ఆకాశమంత అనుమానం తొలిగింది గుర్తుపడతావో లేదా అని భయపడ్డాను.

కార్లో కూర్చో - మా యింటికి వెడదాము అంది...

లక్షలు విలువచేసే ఆ కారులో ఎక్కికూర్చున్నాను. మండుటెండలో నిలబడ్డనేను ఒక్క క్షణంలో శరత్ వెన్నెలలోకి అడుగు పెట్టాను.

నావాలకం చూసి- ఆకారు ఏ.సి. అని అన్నది.

కారు మలయసమీరంలాగా సాగిపోతోంది."వాడకాని వాఢ దేశం కాని, ఈ దేశానికొచ్చావేం" అని అడిగింది.

యూనివర్శిటీలో పనివుండి వచ్చాను.

డ్రైవరు ఏదో భాషలో ఏదో చెబుతున్నాడు. రామశేషమ్మ అతనికి ఏదో ఆదేశిస్తోంది.

ఇల్లుచేరాము. ధనం సమకూర్చగల ఆధునికి సౌకర్యాలన్నీ ఆ యింట్లో అడుగడుగునా కనిపిస్తున్నాయి. అందానికి అందం విలువకి విలువ సుఖానకి సుఖం-

ఇల్లు ఎలావుంది నచ్చిందా? అని అడిగింది.

"చూడ ముచ్చటగా వుంది" అని అన్నాను.

నౌకరు వచ్చి, ఏదో గందరగోళంగా చెప్పడు. ఆవిడ ముఖంలో రవ్వంత చిరాకు కనిపించింది. అంతలో నావంక చూశి ముఖమంతా చిరునవ్వు పులుముకుంది.

"చిన్నబాబు-నువ్వు టిఫిన్ కాఫీ తీసుకుంటూవుండు ఇప్పుడే వస్తా" అని అంది.

"తొందరలేదు ఇద్దరం కలిసి తీసుకుందాం. మీరు వెళ్ళిరండి"

"నేను ఎప్పటినుంచి 'మీరు' అయ్యాను?" అని అడిగింది. నేనా వ్యక్తి వంక ఒక్క క్షణం చూశి.

"రామశేషమ్మా వెళ్ళిరా" అని అన్నాను.

అల్లా అను బాగుంది. "ఇప్పుడేవస్తా" అంటూ బయటకు వెళ్ళింది.

మారుమూల కుగ్రామము. మా వూరులో ఆనాటి నలబై నెంబరు ముతకచీరె, గువ్వంచురైక మనిషేనా నాతో యిప్పుడు మాట్లాడింది అన్న అనుమానం నన్ను వదల్లేదు.

మా వూరు అప్పుడు చాలా చిన్న గ్రామము. చాలా కష్టపడి వెదికితేనేగాని, తాలూకా మ్యాపులో కనిపించదు. ఆ వూరు సగటు మనుష్యులలో, సగటు మనిషి వెంకట సుబ్బయ్య. నోరు వాయిలేని జీవి. మిల్లులో ముఠాకూలి పనితప్ప తనకంటూ ఒక వ్యక్తిత్వంలేని ఆ అమాయకుడి ఇంటికి ఒక పున్నమినాడు పూలమాలలతో మధుపర్కంతో-వెలుగు వెల్లువలాగా - ఇంటి ఇల్లాలుగా, పరువాల పెన్నిధి రామశేషమ్మ వచ్చింది.

మలి పున్నమికి-ఇంటి యజమానిగా మారింది.

"ఎంతకాలం యీ గొడ్డుచాకిరి ఎంత కాలము చాలీ చాలని బ్రతుకులు. సబ్బు లేకుండా, సెంటు లేకుండా జంతువులలాగా ఎందుకు బ్రతకాలి. కావలసినంత సంపాదించడం నీకు చాతకాకపోతే చెప్పు. న్యాయంగా ధర్మంగా నేను సంపాదిస్తాను." "సంపాదించనా?" అని కట్టుకున్నవాడిని సవాల్ చేశింది.

వెంకట సుబ్బయ్య జీవితంలో ఎవరి మాట కాదనలేదు. ఎవరికి ఎదురు ప్రశ్న వెయ్యిలేదు.

ఆ మనిషికి వచ్చిన చదువుసంధ్య ఏమిటో ఎవరికి తెలియదుకాని- తెలిసిందల్లా మగవాడై పుట్టి వుంటే రాజ్యాలు ఏలేది. నేర్పుకి చాకచక్యానికి తనకు తానేసాటి అనిపించుకుంది.

సత్రం వసారాలో చిన్నతడికల కొట్టులో ప్రారంభించిన కిరాణాకొట్టు చూస్తూవుండగానే ఒక చిన్న సూపర్ మార్కెట్‌గా మారింది.

పశువులకి దాణా దగ్గరనుంచి- పెళ్ళి కూతురు చీరెదాకా ఆ దుకాణంలో దొరకవలసిందే. పైగా డబ్బుకి తొందరలేదు. కొంచం ముందువెనకగా ఇవ్వవచ్చును.అసలే అరువుఅంటె ఆరు ఏనుగులని కట్టెయ్యమని దోరణి మా వూరి వాళ్ళది. పెద్ద మొత్తాలలో డబ్బు కావలసివస్తే రామశేషమ్మ దగ్గర చీటీపాడి తీసుకోవచ్చును.

చూస్తూవుండగానే ఆ వూళ్ళో అందరికి కావలసిన వ్యక్తి ఎవరు? అని అడిగితే అందరి దగ్గర ఒకటే సమాధానం.

రామశేషమ్మ !!

ఎన్ని పనులున్నా ఎంత హడావిడిగా వున్నా ఎప్పుడో ఒకసారి వీలుచేసుకుని మా యింటికి రావడం మా అమ్మ దగ్గర కూర్చొని మా అందరితో పిచ్చాపాటి మాట్లాడటము, ఆపూట మా యింట్లోభోజనం చెయ్యడం ఇవన్ని మాకు అలవాటు ఆనవాయితా అయ్యాయి.

ఒక రోజున సరదాకి అడిగాను. "ఈ మగ తెలివితేటలుఅన్ని నీకు ఎల్లా వచ్చాయి' అని ?

గల గలా నవ్వింది "అనురాధలో తడిస్తే ఆడది మగవాడు అవుతాడు" అని అంది.

కాలం గడిచింది. ఇన్ని వ్యవహారాలు చూశుకుంటూనే ఇద్దరు పిల్లల తల్లి అయింది.

మా పల్లె పంచాయితిగా మారింది.

ఒక శ్రీరామ నవమినాడు చిన్న బజారులో పెరుమాళ్ళు దుకాణం తెరిచాడు. ఇంటికి కావలసిన పాత్ర సామానులు ఫర్నీచరు వగైరా వాయిదాల పద్దతినిగాని లేదా యీరోజు డబ్బుకట్టి ఎన్ని రోజుల తరువాత తీసుకుంటె, అంతశాతం రిబేటు మీద అమ్మే- పద్ధతి ప్రవేశపెట్టాడు.

వస్తువు మంచిది సదుపాయము ఎక్కువ. పైగా కారుచవక. చెప్పిన గడువుకంటె ముదుగానే సరుకు ఇంటికి వస్తోంది. అంతకన్నా కావలసిందేముంది.

ఎక్కడెక్కడి జనం మా వూరుకు రావడము పెరుమాళ్ళ దర్శనం చేశుకోవడము, రాబోయె వరానికి ముందుగా, ముడుపుకట్టుకోవడము.

మా వూరు మేజరు పంచాయితిగా మారింది. ఆరోజున జరిగిన ఉత్సవాల సందర్భంలో ఒక క్రొత్త నినాదం వినిపించింది.

నిన్నటి ముందు చూపు
ఈనాడు ఇస్తుంది శుభం
ఈనాటి పొదుపు ఇస్తుంది
రేపటి ఐశ్వర్యం !!!

మాస్కీములో చేరండి. తేలికగా కుచేరులుకండి! అయిదు వసంతాలలో మీధనం రెట్టింపుచేసుకోండి ! నెల, మూడునెలలు, ఆరునెలలు, సంవత్సరం పద్దతిలో వడ్డీ మీవాకిట్లోకి వస్తుంది. రేపటి స్వర్గానికి యీనాడే సోపానం నిర్మించండి అని శ్రీ సుందర రామా ఫైనాన్స్

కార్పొరేషన్ వారు హెచ్చరిక చేశారు.

కాబోయే కుబేరులకి చక్కటి అవకాశం లభించింది. ఆ కంపెనీ దగ్గర ఏరోజు చూశినా సినిమా మొదటి రోజు అంత సందడి హడావిడి.

ఆ కంపెనీ మేనేజింగ్ పార్టనర్ సామ్యూల్‌గారిని "అయ్యా మీరు ఇంతఫడ్డీ ఎల్లా ఇస్తున్నారు" అని అడిగితే ఆయన నవ్వుతూ "వ్యాపారంలో అబద్దం ఆడితే అన్నం పుట్టదు నిజం చెబితే నీళ్ళు పుట్టవు" అని అన్నాడు.

మా వూరు కూడా ఎల్లలు హద్దులు దాటింది. కాలినడక భారమైయింది. దూరం పెరిగింది. జనానికి వాహనయోగం పట్టెసరికి రద్దీ పెరిగి ప్రాణవాయువుపాలు వాతావరణంలో తగుమాత్రంగా తగ్గింది.

అన్ని రకాల జబ్బులు అన్ని కాలాలలో మాకు శాశ్వత అతిధులు అయ్యారు...

చూపు వూరుదాటి నాగరీకతకు నగరాల వైపు పరుగు తీశింది.

"ఈ పల్లెటూరులో ఆస్తిపాస్తులకి విలువ యేమిటి? పట్టణాలలో ఇల్లువాకిలి ఏర్పాటు చేసుకోండి. ఆధునికి సౌకర్యాలు పొందండి. క్షణం క్షణం విలువ పెరిగే ఆస్తికి యజమానులుకండి!!" అంటూ మా చెవిని ఇల్లు కట్టుకుని పోరడం మొదలుపెట్టాడు. దైవాధీనం రియల్ ఎస్టేట్ మేనేజింగ్ పార్టనర్, డి.దామోదరంగారు.

మా రేపటి కుబేరులు అటు పరిగెత్తారు.

ఆ సంస్థ బ్రాంచి మా వూళ్ళో ప్రారంభించడానికి సుదూరం నుంచి వచ్చారు. శ్రీ సుకుమార్‌నాయర్ గారు.

ఆనాటినుంచి మా వూరిపని మూడుపువ్వులు అరవై ఆరు కాయలుగా వుంది. ఆర్భాటపు పెళ్ళికొడుకు పేరంటాల వెనక పడ్డట్టు, - తేలికగా-క్షణంలో- మీరు కుబేరులు అవుతారని ఎవరు ఏ పథకం పెడితే దాంట్లో చేరడానికి మా వాళ్ళు తస్సల రసల !!" అంటూ ముందుకు దూకడమే.

మేజరు పంచాయితి మున్సిపాలిటి అయ్యింది ! ఇంత ప్రగతిని సాధించిన- మా వూరి ప్రజలని అభినందించడానికి ఎందరో మహానుభావులు మా వూరుకు వచ్చారు.

ఆనాడు అందరిలో పెద్దపీటమీద కూర్చున్నది రామశేషమ్మ !!

అంటి ముట్టనట్టు వుంటావేం? దేంట్లోను కలియవేం? అని రామశేషమ్మ నన్ను అడిగింది.

ఒడ్డున నిలబడే సముద్రాన్ని పొగడాలి, తెలియక దిగుతే - మొసళ్ళు తిమింగలాలు ... ... ఇంతే సంగతులు.

నీ వేదాంతానికేంలే. ఈ సిరిసంపదలు నీకు అక్కర్లేదా?

"దిగంబర సన్యాసికి చాకలితో పని ఏమిటి?" అని అన్నాను.

గల గల నవ్వింది- "మాటలు బాగా నేర్చావు" అని అంది.

కళ్ళు పోయిన తరువాత సూర్య నమస్కారాలు ప్రారంభమైయ్యాయి.

ఒకనాటి ఉదయం జనం గందరగోళం పడుతున్నారు.

రామశేషమ్మ కుటుంబం కనిపించలేదు. సరుకులు ఇచ్చిన వాళ్ళు చీటీలకి డబ్బులు కట్టినవాళ్ళు లబో దిబో మంటున్నారు.

అంచనా వేసి చూస్తే ప్రజల సొమ్మ లక్ష రూపాయలదాకా పరమేశ్వరార్పణమస్తు అని తేలింది.

ఈ గండం గడిచి గడవకముందే మబ్బులేని పిడుగు పడింది.

పదిహేనురోజులు తీర్థయాత్రకని వెళ్ళిన "పెరుమాళ్ళు" అని ఇంతకాలం చెప్పుకున్న వ్యక్తి - తిరిగి రాలేదు.

అనివార్య కారణాలవల్ల తను తిరిగి రాలేకపోతున్నాని కొట్లొది గోడైనులోని సామానులు అమ్మేశి కాతాదారులకి సరిపెట్టవలసిందని ఛైర్మెనుగారికి ఉత్తరం రాశాడు.

"నుయ్యి తవ్వబోతే దయ్యం బయట పడినట్లు" నలభై వేల రూపాయల సరుకు నాలుగు లక్షల రూపాయలకి సరిపుచ్చడం ఎలా అని ఆయన సతమతమవుతూవుంటె కాగల కార్యం గంధర్వులే తీర్చారు. పెరుమాళ్ళుకు అప్పుమీద సరుకు ఇచ్చిన వాళ్ళు కోర్టు ఆర్డరు తీసుకువచ్చారు. వారి సొమ్ముకాపాడుకున్నారు.

మా వాళ్ళపని సర్వం కృష్ణార్పణమస్తు!

ఈ తుఫాను ఇంకా పూర్తిగా వెలియలేదు. పులిమీద పుట్రపడ్డది.

డిపాజిట్లమీద వడ్డీలు రావడం మానేశాయి. అసలుకు ముప్పువచ్చింది. ఆ డబ్బు ఏమైపోయిందో ఆ మనుషులు ఏమైయ్యారో ఆనాటికి యీనాటికి తెలియదు.

కష్టాలన్ని కట్టగట్టుకుని ఒకసారేవస్తాయిగా!

పట్టణంలో మనకు మేడలు మిద్దెలు కట్టించి యిస్తామని డబ్బు వసూలుచేశింది- కలలోని గాలిమేడల కోసమని తెలిసి నిజం పీడకలగా మారిన రోజులు.

బలవంతులకి దుఃఖం ఆగలేదు. బలహీనులకి గుండె మరి ఆడలేదు.

ఎవ్వరితో మొత్తుకుంటె ఏం లాభం ఆర్చేవారేవరు తీర్చేవారేవరు? ఆ నలుగురిని తిట్టినతిట్టు తిట్టకుండాతిట్టారు.

కాని తిట్టగా చచ్చినవారులేరు. దీవించగా బ్రతికినవారు లేరు... ఎవ్వరిని ఏమిచేయలేక అత్తమీద కోపం దుత్తమీద చూపించడం మొదలు పెట్టారు.

"ప్రక్క యింటి పోరు అంటె. పండుగంతవేడుక" నవ్వినవాళ్ళు నవ్వారు దెప్పిన వాళ్ళు దెప్పారు.

మా బ్రతుకు పాలపొంగులాగా అయింది. బిగ్గరగా ఏడవడానికి కూడా వీలులేదు. నలుగురు నవ్వి పోతారేమోనని నామోషి !!!

కుచేలుడు- కుబేరుడై మళ్ళి కుచేలుడైయ్యాడు.

మా అత్యాశకు మేము విధించుకున్నా జుర్మానా పాతికలక్షలు దాటిందని ఆనోట ఆనోట విన్నమాట.

ఆ నలుగురిని ఎక్కడో దొరల్లాగా బ్రతుకుతూ వుంటారు. మాకు దొరికితేనేగా వాళ్ళు దొంగలు !!

కాలమే అన్ని గాయాలకు మందు.పుష్కరం గడిచింది. మళ్ళీ యిప్పుడిప్పుడే మనుష్యులలో పడుతున్నారు.

ఆనాటి రామశేషమ్మ ఈనాడు కనిపించింది.

"పగటి కలలా"? అంది రామశేషమ్మ కాఫీ కప్పు అందిచింది.

రకరకాల ఫలహారాలు నాముందు వుంచింది. నావంక చూస్తూ

"ఏమన్నా బాగుపడ్డావా! ఇంకా వెర్రిమాలోకంగా వున్నావా? అంటూ అడిగింది.

"వెంకట సుబ్బయ్య ఎల్లా వున్నాడు" అని అడిగాను... రామవేషమ్మ క్షణం మౌనంగా వుంది. నావంక చూడకుండా. "విడిగా పెళ్ళి చేసుకున్నాడు" అని అంది.

పిల్లలు?

బాగున్నారు. కాని మన యింటికి రారు నాతో మాట్లాడరు? ... నాసంగతి వదిలేయి... నీ సంసారం ఎల్లా వుంది? పిల్లలు ఏం చేస్తున్నారు?

చెప్పడానికేముంది? మామూలే. అబ్బాయి ఇంజనీయురు, కన్నడం అమ్మాయిని చేసుకున్నాడు. అమెరికాలో స్థిరపడ్డాడు.

అమ్మాయికి పెళ్ళి చేశావా?

అమ్మాయి అల్లుడు ఇద్దరూ డాక్టర్లు. అలహాబాదులో ఉంటున్నారు.

దీనికంతా చాలా డబ్బుకావాలిగదా? ఎక్కడిది?

లేనిపోనీ అంతస్థులకి పోవాలని నేననుకోలేదు. నా సంపాదనలో సగం పిల్లల కోసం మిగతాది మాకోసం. ప్రతినెల సంతంగా వాళ్ళకోసం కొంతడబ్బు బ్యాంకులో వేస్తూ వచ్చాను. అదే ఆదుకుంది. మహారాజులాగా బ్రతకాలని కోరుకోలేదు. మనుష్యులలాగా బ్రతికితే చాలననుకున్నాను. అందుకే బ్రతుకు సాఫీగా వెళ్ళిపోతోంది !!

"పెరుమాళ్ళ సంగతేమన్న తెలిసిందా?" అని అడిగాను.

తెలియకేం. స్టార్ హోటల్ కట్టాడు... అది చాలదని డ్రగ్గస్‌కు వెళ్ళాడు. ప్రస్థుతం జైల్లో వున్నాడు.

స్యామ్యూల్. మన అందరిడబ్బు పెట్టి బినామిగా ఆస్తులు కొన్నాడు. వాళ్ళు ఎదురు తిరిగి ఆస్తులు స్వాధీనం చేసుకుని అనుభవించడం మొదలు పెట్టారు. మతిపోయి చెరువులో దూకి చచ్చిపోయాడు.

"నాయర్?"

రామశేషమ్మ మాట్లాడలేదు.

నాకు క్షణం అర్ధమైంది. "ఇది నాయరు గారి ఇల్లా" అని అడిగాను. అవునన్నట్టు తలవూపింది.

మనవూరు నాందివు నువ్వు, భరతవాక్యం నాయర్ కాదో ? !!...

'చిన్నబాబు' అంటూ నెమ్మదిగి పిలిచింది.

ఆవిడవంక చూశాను.

"మీ కుటుంబం అంటే నాకు చాలా ఇష్టం. మీకు లేనిపోని ఆడంబరాలు లేవు. పొదుపుగా జాగ్రత్తగా వుంటారు. అందరి చేత ఔననిపించుకుంటున్నారు....

"మాలాగా - ఎన్నడూ కావొద్దు. క్షేమంగా వెళ్ళిరా" అని అంది.

నేను గుమ్మందాకావెళ్ళి ఒక్కసారి వెనక్కి తిరిగి చూశాను.

వడివడిగా నాదగ్గరకు వచ్చింది.

"నామీద కోపం వద్దు" అని అంది.

తలుపు దగ్గరకు వేసుకొని రోడ్డుమీదకు వచ్చాను.